క్లుప్తంగా

మురుగు, చెత్తాచెదారాల తొలగింపు



చెత్తను శుభ్రం చేయిస్తున్న పంచాయతీ అధికారులు

వేంపల్లె : గ్రామపంచాయతీలో ఉన్న మురుగు, చెత్తాచెదారాలను పంచాయతీ సిబ్బంది తొలగించారు. నాలుగు రోజులుగా పంచాయతీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో మురుగు, చెత్తాచెదారాలు తిష్ట వేశాయి. దీంతో ఆదివారం సాక్షి దిన పత్రికలో 'సమస్యల తీష్ట.. తొలిగే దెట్ట' అనే శీర్షిక ప్రచురితం కావడంతో పంచాయతీ అధికారుల్లో చలనం వచ్చింది. వెంటనే అధికారులు స్పందించి కడప రోడ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న చెత్తకుండీలో ఉన్న చెత్తాచెదారాలను తొలగించారు. అలాగే బాలిశెట్టి వీధిలో ఉన్న కాలువలలో చెత్తాచెదారాలతో నిండి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుంటే వాటిని తొలగించి మురుగును కాలవలో పారే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సిబ్బంది కొరతతో చెత్తాచెదారాలను తొలగించడం కొంచెం ఆలస్యమైందని గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణ, శానిటరీ మేస్త్రి మల్లికార్జున తెలిపారు.

ఉగాది 'చల్ల' పంపిణీ



చల్లపంపిణీకి హాజరైన ప్రజలు

ముద్దనూరు : స్థానిక పాతవీధి రామాలయం సమీపంలో సోమవారం చల్ల పంపిణీ జరిగింది. ఉగాది పర్వదినం మరుసటి రోజున ఉదయం కరణం ఇంటివద్ద ఉగాది చల్లను పంపిణీ చేస్తారు. ముందుగా పూజాది కార్యక్రమాలు జరిగిన అనంతరం నిర్వాహకులు చల్లను ప్రజలకు పంపిణీ చేశారు. ఉగాది చల్లకు స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ

పులివెందుల టౌన్ : త్రిమత ఏకైక గురువు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్ల ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం ఉగాది క్యాలెండర్లను ఆవిష్కరించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ వేణుగోపాల్ చేతుల మీదుగా క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఈ జ్ఞాన తెలుగు కాలసూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతి ఒక్కరికి సరళమైన భాషలో అర్థం అయ్యే విధంగా రూపొందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక పులివెందుల కమిటీ అధ్యక్షుడు వరుణ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.


పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీను తెలిపారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో సీపీఎం ఆధ్వర్యంలో రూపొందించిన విద్యుత్ షాకులు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం...అధికారంలోకి వచ్చాక విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచి సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలపై భారం మోపిందని అన్నారు. విద్యుత్ వినియోగదారుల జేబులకు చిల్లులు పడేలా ప్రభుత్వం తీసుకువచ్చిన టైం ఆఫ్ డే టారిఫ్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకుని ట్రూ ఆప్ ఛార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు, శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

వృద్ధుడు అదృశ్యం

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వై.జంక్షన్ సమీపంలో ఆర్‌వీఎస్ నగర్‌లో నివాసం ఉంటున్న రాజు రామసుబ్బారెడ్డి (74) అనే వృద్ధుడు సోమవారం ఉదయం 10:30 గంటల సమయంలో ఇంటి నుంచి బయలుదేరి వెళ్లారు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. అతని ఆచూకీ తెలియరాలేదు. అతని కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు. ఆచూకీ తెలిసిన వారు కడప చిన్నచౌక్ సీఐ సెల్ నెం: 9121100520కుగానీ, 9121100521కు గానీ తెలియజేయాలని చిన్నచౌక్ ఎస్ఐ ఎన్. రాజరాజేశ్వర్‌రెడ్డి తెలియజేశారు.

ఘనంగా ఈద్-ఉల్-ఫితర్



కమలాపురం ఈద్గాలో కుత్బా చదువుతున్న నాసీర్ హుసేని



కమలాపురంలో ఈద్-ఉల్-ఫితర్ నమాజ్‌కు హాజరైన ముస్లింలు

కమలాపురం : మండలంలోని ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆదివారం రాత్రి నెలవంక కనిపించడంతో సోమవారం ఈద్-ఉల్-ఫితర్ పండుగను నిర్వహించు కోవాలని మత పెద్దలు పిలుపు నిచ్చారు. దీంతో పట్టణానికి చెందిన ముస్లింలు ఉదయమే సాంప్రదాయ దుస్తులు ధరించి స్థానిక ఈద్గాకు చేరుకున్నారు. ప్రభుత్వ ఖాజీలు హాఫీజ్ జాహిద్ హుసేన్ నమాజ్ చదివించగా, నాసీర్ హుసేని ప్రత్యేక కుత్బా చదివి వినిపించారు. ముస్లింలు దాన ధర్మాలు ఎక్కువగా చేయాలని సూచించారు. ప్రత్యేకంగా రంజాన్ మాసంలో తమ బంగారు వస్తువులకు సంబంధించి జకాత్ చెల్లిచండంతో పాటు అపుడే పుట్టిన బిడ్డ పేరున సైతం ఫిత్రా చెల్లించాలన్నారు. ఇలా దాన ధర్మాలు చేయడం ద్వారా పేదలు కూడా సంతోషంగా పండుగ జరుపుకుంటారని ఆయన వివరించారు. అనంతరం ఒకరి నొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. అలాగే స్థానిక దర్గా-ఏ-గఫారియా, ఖాదరియా నందు పీఠాధిపతి హాజరత్ మహమ్మద్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ప్రత్యేక బయాన్ చేశారు. అలాగే పట్టణంలోని అక్సా మస్జిద్ సమీపంలోని గ్రౌండ్‌లో సైతం హజరత్ తాహెర్ ఆధ్వర్యంలో ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ ఆచరించారు. గంగవరం, విభరాపురం, కోగటం, పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు, మొలకవారిపల్లె, చిన్న చెప్పలి, పెద్దచెప్పలి, లేటపల్లె, పొడదుర్తి, జీవంపేట తదితర గ్రామాల్లో ఈద్-ఉల్-ఫితర్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మిత్రులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్,టౌన్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లె, కొత్తపల్లె, యర్రబల్లె, తుమ్మలపల్లె, కనంపల్లె, రాగి మాను పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలలో ముస్లింలు ఉదయం 7 గంటలకే గ్రామాలలోని మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పులివెందులలోని శ్రీరామాహాలు రోడ్డు సమీపంలో ఉన్న ఈద్గా మసీదు, పార్నపల్లె రోడ్డులో ఉన్న మసీదు, కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న మసీదుల్లో పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ ఆదేశాల మెరకు గట్టి బందో బస్తు ఏర్పాటు చేశారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండలంలోని గురిజాల, హిమకుంట్ల, బిదినంచర్ల, బలపనూరు, కోరుగుంటపల్లె, తదితర గ్రామాల ఈద్గా మైదానాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు నల్లరిబ్బన్ కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని ఉరుటూరు, గంగిరెడ్డిపల్లె, అనిమెల, ఎన్.పాలగిరి, నేలతిమ్మాయపల్లె, యు.రాజుపాలెం గ్రామాల్లో ముస్లింలు భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బంధువులు, స్నేహితులకు బోజనాలు ఏర్పాటు చేశారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : నీతి, నిజాయతీ, నమ్మకం అనేవి లేకపోతే భవిష్యత్తు ఆంధకారమే అవుతుందని ఆస్థానయే గౌసియా పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ, జామీయా మసీదు పీఠాధిపతి సయ్యద్ షా సాదిక్‌పాషా ఖాద్రీలు తెలిపారు. రంజాన్ సందర్భంగా వేరువేరుగా ఈద్గాలలో ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఉన్నవారు లేని వారి కోసం కొంత సంపదను దానధర్మాలు చేయాలి. కార్యక్రమంలో సయ్యద్‌షా తాహీర్‌పీరాఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో

వేంపల్లె : వేంపల్లెలోని ఈద్గా సమీపంలో జరిగిన ఈద్-ఉల్ -ఫితర్ ప్రత్యేక ప్రార్థనలకు కేంద్ర ప్రభుత్వం తీసుకుని వస్తున్న వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రత్యేక ప్రార్థనలకు హాజరైనారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న మర్కస్ మసీదు వద్ద నుండి ముస్లింలు ర్యాలీగా బయలు దేరి మర్కస్ మసీదు మౌలానా హర్షద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జకాత్ పేరుతో పేదలను ఆర్థికంగా ఆదుకోవడం జరుగుతుందని చెప్పారు. అలాగే రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. విందు భోజనాలు చేసి అందరూ సంతోషంగా గడిపారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలో ముస్లింలు వలసపల్లి రోడ్డులో ఉన్న ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వీరికి మత గురువు హితోపదేశం అందించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ నరేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అలాగే చిలంకూరు, కలమల్ల, తిప్పలూరు పోట్లదుర్తి ఇతర ప్రాంతాలలో కూడా రంజాన్ పండుగ సందర్భంగా ఆయా ప్రాంతాలలోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : నెలరోజుల పాటు ఉపవాసాలతో గడిపి సోమవారం ముస్లింలు రంజాన్ పర్వదిన వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మసీదులో ప్రార్థనల అనంతరం తాడిపత్రి రహదారిలోని ప్రార్థనా స్థలంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువులు రంజాన్ పర్వదిన ప్రాముఖ్యాన్ని వివరించారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం, గంగనపల్లె, మొయిళ్లకాల్వ, దర్బార్‌పేట, వెల్లటూరు, కొండూరు తదితర గ్రామాల్లో సోమవారం ముస్లీం సోదరులు రంజాన్ పర్వదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాలల్లో మసీద్‌లు, ఈద్గాలల్లోప్రత్యేక ప్రార్థనలు చేశారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని అన్ని గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ఉదయాన్నే సంప్రదాయ దుస్తులు ధరించి, ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువులు దైవ సందేశాన్ని ప్రార్థనల వద్ద వినిపించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బంధుమిత్రులతో కలసి విందు భోజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

వల్లూరులో

వల్లూరు : మండలంలోని వల్లూరు, కోట్లూరు, తోల్లగంగనపల్లె, దిగువపల్లె, పెద్దపుత్త, గణేష్‌పురం, ధర్మాపురం కాలనీ, పైడికాలువ, తప్పెట్ల తదితర గ్రామాలలోని ముస్లింలు స్థానికంగా వున్న మసీదులకు వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువులు పవిత్ర ఖురాన్‌లోని నీతిని గురించి ప్రత్యేక భోధనలు చేశారు. దువా చేసిన అనంతరం రంజాన్ శుభాకాంక్షలను తెలుపుకున్నారు. ముస్లింలు దాన ధర్మాలను నిర్వహించారు. బంధు మిత్రులతో విందులలో పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు



పులివెందులలో ఈద్గావద్ద ప్రత్యేక ప్రార్థనలో ముస్లిం సోదరులు



సింహాద్రిపురంలో నిరసన తెలుపుతున్న ముస్లింలు



యు.రాజుపాలెంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



జమ్మలమడుగులో దువా చేస్తున్న ముస్లింలు



వేంపల్లెలో ఈద్గావద్ద ప్రత్యేక ప్రార్థనలో ముస్లింలు



ఎర్రగుంట్లలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లీంలు



ముద్దనూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చింతకొమ్మదిన్నెలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు



పెద్దపుత్త మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రైతుల కడుపు కొట్టిన కూటమి ప్రభుత్వం

కమలాపురం: తీవ్ర కరువుతో కొట్టు మిట్టాడుతున్న కమలాపురం నియోజకవర్గ ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించకపోవడం కూటమి ప్రభుత్వం రైతుల కడుపు కొట్టినట్టేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు సాయినాథ శర్మ ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా నష్టపోయి అప్పులు చేసుకుని దిక్కు తోచని స్థితిలో రైతులు ఉన్నప్పటికి కమలాపురం నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించక పోవడం విచారకరం అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో కమలాపురంలోని ఒక్క మండలం కూడా లేక పోవడం తీవ్ర ఆవేదన కలిగిస్తోందన్నారు. నియోజకవర్గ రైతులు వర్షాధార పంటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, సాగు చేసిన పంటలకు పెట్టుబడులు సైతం రాక భూములను చూసిన రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతాంగం పట్ల ఈ ప్రభుత్వానికి, పాలకులకు ఏ మాత్రం శ్రద్ధ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ కడప జిల్లాలో 10 మండలాలను కరువు ప్రాంతంగా ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 51 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల కరువు విలయ తాండవం చేస్తున్నప్పటికీ కేవలం 10 మండలాలనే కరువు మండలాలుగా గుర్తించడం చూస్తుంటే రైతుల ఓట్లతో అందలమెక్కిన నాయకులు రైతాంగ సమస్యల పట్ల ఏ మాత్రం శ్రద్ధ వహించలేదన్న విషయం అర్థం అవుతోందన్నారు. నీటి పారుదల సౌకర్యం ఉన్న దువ్వూరు, మైదుకూరు, ఖాజీపేట, చాపాడు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన అధికారులు తీవ్ర కరువుతో అలమటించిపోతున్న కమలాపురం నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించక పోవడం చూస్తుంటే అధికారులు రైతుల పట్ల చిన్నచూపు చూస్తున్నారని అర్థం అవుతోందన్నారు. నియోజకవర్గంలో 70 శాతం రైతులు వర్షాధారం కింద పంటలు సాగు చేసి జీవనం సాగిస్తున్నారని, కరువు మండలాలుగా ప్రకటించి ఉంటే వారందరికి ప్రభుత్వం నుంచి ఎంతో కొంత సహాయం అందేదన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డితో కలసి రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం పంపిస్తామని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుకుని కమలాపురం నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

వైఎస్ కుటుంబంతోనే సంక్షేమం, అభివృద్ధి



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వేంపల్లె : వైఎస్ కుటుంబంతోనే సంక్షేమం అభివృద్ధి సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చంద్రఓబుల్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక గండి రోడ్డులో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నియోజకవర్గ వ్యాప్తంగా జల్ జీవన్ మిషన్ కింద వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు సుమారు రూ.480 కోట్లు మంజూరు చేయించి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. దాదాపు 90 శాతం పనులు చేపట్టిందని ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. ప్రస్తుతం 10 శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అలాగే అలాగే అప్పట్లో వేంపల్లి మండలంలో వేసవి కాలం ముందస్తు జాగ్రత్తగా గ్రామపంచాయతీలో 13 తాగునీటి బోర్లు వేయించారన్నారు. అవి ప్రస్తుతం పనిచేస్తున్నాయని... అవే లేకపోతే వేంపల్లిలో తాగు నీటికి కరువయ్యేదన్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో ఆయా బోర్లలో నీటిమట్టం తగ్గిపోవడంతో ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మూడు బోర్లు వేసి ఏదో చేశామని సంకలు గుద్దుకుంటున్నారని విమర్శించారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే కరువే అన్న మాట ప్రజల్లో నానుడు ఉందన్నారు. వేంపల్లి గ్రామపంచాయతీలో అవినీతి ఆరోపణపై ఈవో వెంకటసుబ్బారెడ్డి సస్పెండ్ అయ్యి నెల గడుస్తున్నా ఇంతవరకు ఏ అధికారిని నియమించకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి నేతల ఆధిపత్య పోరుతో ఇక్కడ పనిచేయుటకు ఏ అధికారి ముందుకు రావడంలేదన్నారు. దీంతో గ్రామపంచాయతీలోని మురుగు నీరు, చెత్తాచెదారాలు, ఒకపక్క దోమల విజృంభించడంతో ప్రజలు అల్లాడిపోతున్నారని తెలిపారు. ఆదిపత్య పోరును పక్కనపెట్టి సమర్థవంతమైన ఈవోను నియమించి ప్రజా సమస్యలపైన దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా వేంపల్లిలోని ఆర్టీసీ బస్టాండును పూర్తిస్థాయిలో ప్రారంభించడంతో పాటు రైతు బజార్ ను వినియోగంలోకి తీసుకొచ్చాం అని చెప్పుకునే పరిస్థితి కూడా కూటమి ప్రభుత్వానికి లేదని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో పులివెందుల తర్వాత వేంపల్లిను అభివద్ధి చేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కే దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మునీర్‌బాషా, సర్పంచ్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కటిక చంద్రశేఖర్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన ఎన్‌డీఏ కార్యకర్తలు



పార్టీలోనికి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

మైలవరం : మండలంలోని వద్దిరాల గ్రామానికి చెందిన ఎన్‌డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి సమక్షంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామంలోని సుంకులాంబ తిరునాల సందర్భంగా ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఎన్‌డీఏ కూటమికి చెందిన కొందరు కార్యకర్తలు స్థానిక నాయకుడు వెంపలాకు రామాంజనేయులు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పార్టీ కండువా వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వెంపలాకు చెన్నూరు యాదవ్, పెద్దలక్షుమయ్య, దస్తగిరి, గద్వాల్ ఖాసీ, పి.సుబ్రమణ్యం, గురుశేఖర్, ఫణీత్, మరో 15 మంది పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రజలకు సకాలంలో సంక్షేమ పథకాలు అందేవన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, జడ్పీటీసీ మహాలక్ష్మీ, మండల కన్వీనర్ మహేశ్వరరెడ్డి, చిన్న కొమెర్ల సర్పంచ్ జగదీశ్వరరెడ్డి, జమ్మలమడుగు కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, మున్సిపాలిటీల విభాగ జిల్లా అధ్యక్షుడు హృషికేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కడప రిమ్స్ మార్చురీలో రెండు మృతదేహాలు



కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో ఇద్దరు వేర్వేరు గుర్తు తెలియని వ్యక్తులు చికిత్స పొందేందుకు వచ్చారు. వారు చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆ రెండు మృతదేహాలను మార్చురీలో ఉంచారు. వారి ఆచూకీ తెలిసిన బంధువులు, కుటుంబసభ్యులు ఎవరైనా ఉంటే తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని రిమ్స్ అధికారులు తెలిపారు.

వైభవంగా నారాయణస్వామి తిరునాల



ప్రత్యేక అలంకరణలో నారాయణ స్వామి



తిరునాలలో పాల్గొన్న భక్తులు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బాలుపల్లె సమీపంలో వెలసిన కమ్మేటిపల్లె నారాయణస్వామి తిరునాల సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది ఉగాది మరుసటి రోజు నారాయణ స్వామి తిరునాల నిర్వహించడం ఆనవాయితీ. నారాయణస్వామి, రామయ్యస్వామి, కంటిపాపులమ్మ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వాములను దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. విందు భోజనం ఏర్పాటు చేసుకున్నారు. రామయ్యస్వామి శిష్యులు చేసిన గుర్రపు స్వారీ భక్తులను అలరించింది. ఆలయ ధర్మకర్తలు భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలి

రాజుపాళెం : స్కూల్స్, ఇంటర్మీడియట్, హైర్ ఎడ్యుకేషన్లలో సంబంధిత అధికారులు ప్రభుత్వ విద్యను ప్రోత్సహించకుండా ప్రైవేటు విద్యను ప్రోత్సహిస్తున్నారని రాయలసీమ స్టూడెంట్స్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ పేర్కొన్నారు. రాజుపాళెంలో విలేకరులతో మాట్లాడుతూ ధనార్జనే ధ్యేయంగా ప్రైవేటు పాఠశాలలకు, కళాశాలలకు అధికారులు తొత్తుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఎటువంటి నిబంధనలను పాటించకుండా వారి ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ మౌలిక వసతులు లేకుండా పాఠశాలలను, కళాశాలలను నడుపుతున్నారని పేర్కొన్నారు. అధికారులు రూ.లక్షలు జీతాలు తీసుకుంటూ పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

పులివెందుల టౌన్ : పట్టణంలోని శిల్పారామం, డాక్టర్ వైఎస్ఆర్ ఉల్లిమెల్ల లేక్ ఫ్రంట్‌లో ఉగాది పార్వ, రంజాన్ పండుగలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. స్థానిక శిల్పారామంలో సోమవారం సాయంత్రం వేదాంత హాస్పిటల్ వారి సౌజన్యంతో యువ రాజా డ్యాన్స్ స్కూల్ వారి చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. అలాగే వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో రంజాన్ సందర్భంగా సోమవారం ఎస్కే డ్యాన్స్ స్టూడియో వారి ఆధ్వర్యంలో జగన్నాథం మూవీ టీం హీరో రాయలసీమ భరత్, స్కూల్ లైఫ్ మూవీ హీరో అండ్ డైరెక్టర్ పులివెందుల మహేష్, వృషభ లీడర్ జీవన్‌రెడ్డి, సపోర్టింగ్ క్యారెక్టర్ కిట్టులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి టి. విశ్వనాథ్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ బి.వరప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.